హిమసుందరి

చిత్రకారుడు సోఫామీద శిల్పంలా నిశ్చలంగా, మౌనంగా కూచుని ఉన్నాడు. అతని చూపులు రెప్పలార్పకుండా గోడమీద వేలాడుతున్న పెయింటింగ్‌వైపే నిలిచి వున్నాయి. అతని కళ్ళలో కన్నీటి ప్రవాహం. గోడమీద వేలాడుతున్న పెయింటింగ్‌లో మంచుమీద నగ్నంగా [illegible] అప్సరసలాంటి సుందరి చిత్రం. మంచుకు తడిసిన స్త్రీ అందమైన శరీరభాగం విషంలా నీలంగా వుంది. మంచు చల్లదనానికి నీలం రంగు మెల్లమెల్లగా గాఢంగా మారుతూ ప్రస్ఫుటమౌతోంది. కానీ స్త్రీ ముఖంమీద ఒక అద్భుతమైన, వర్ణనాతీతమైన శాంతి వ్యాపించి వుంది. మంచు చుక్కలు, చుక్కలుగా కరగుతోంది. చిత్రకారుని కళ్ళలో కన్నీరు ధారగా ప్రవహిస్తోంది.



ఎవరో తలుపుతట్టారు. చిత్రకారుడు సమాధిలోనే వున్నాడు. కొంచెంసేపటి తర్వాత గట్టిగా తలుపు చప్పుడయింది. చిత్రకారునికి ధ్యానభంగమయింది. అతను తలుపువైపు చూశాడు. తర్వాత మళ్ళీ పెయింటింగ్ వైపు చూడసాగాడు. ఈసారి మళ్ళీ తలుపు గట్టిగా చప్పుడయింది. జవాబివ్వకపోతే వచ్చినవారు తమంతతామే తిరిగి వెళ్ళిపోతారనే ఆలోచనతో అతనలాగే కూచుని వున్నాడు. వచ్చినవాడు తలుపు తెరిపించిగాని వెళ్ళడన్నట్లు తలుపు మీద కొంతసేపటి వరకు ఏకధాటిగా చప్పుడవుతూ వుంది. అతను గొణుక్కుంటూ అయిష్టంగానే లేచాడు. సగం తలుపు తెరచాడు. బయట నిలబడివున్న వ్యక్తిని చూసి చిత్రకారుడు చిర్రుబుర్రులాడాడు.

'నేను మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను.' ఆగంతకుడు వినయంగా చేతులు జోడించాడు.

'నేనెవ్వరినీ కలుసుకోతలచుకోలేదు' చిత్రకారుడు కోపంగా బదులిచ్చాడు.

'నా ప్రార్థన వినండి. నేనొక కళా సమీక్షకున్ని, సాహిత్యకారున్ని. నేను మీతో చిత్రకళకు సంబంధించి...'

'నాకు చిత్రకళతో ఎలాంటి సంబంధం లేదు.' చిత్రకారుడు తలుపు మూయబోయాడు.

చేతిని అడ్డుపెట్టి అతను తలుపు మూతపడకుండా ఆపాడు. ఇనుపతలుపుల మధ్యలో చిక్కుకున్నందున అతని చేతి నుంచి రక్తం కారసాగింది. రక్తం కారడం చూసి చిత్రకారుడు పులిక్కిపడ్డాడు. ఆగంతకుడు చిరునవ్వుతో అన్నాడు, 'దయుంచి మీరేమీ బాధపడకండి. కళాప్రదర్శనలోనూ, కళాసాధనలోనూ త్యాగం- బలిదానం తప్పనిసరి. మీరు నన్ను లోపలికి అనుమతిస్తారా?' చిత్ర కారుడింకా కారుతున్న రక్తాన్ని చూస్తూ వున్నాడు. రక్తపుధారకు రాయి కరగుతోంది. అతను తలుపు పూర్తిగా తెరచాడు. అతను ఎదురుగా తెరచివున్న బాత్‌రూంలోకి వెళ్ళాడు. కుళాయి తెరచి గాయమైన చేతిని నీటిధారకింద వుంచాడు. కొంచెంసేపటికి రక్తం కారడం ఆగిపోయింది. అతను వెనుదిరిగాడు. చేతిలో క్రీం ట్యూబుతో చిత్రకారుడు అతన్ని చూస్తూ వున్నాడు. చిత్రకారుని కళ్ళలోని ఆక్రోశం చల్లబడిపోయింది. అతను క్రీం రాసి తన రుమాలు అతని చేతికి చుట్టాడు.

'కూర్చో!' చిత్రకారుడు సోఫావైపు చూపించాడు. తాను సోఫామధ్యలో కూచున్నాడు. 'పెద్దగా తగల్లేదుకదా?' అతను గంభీరస్వరంతో అడిగాడు.

'లేదు, థ్యాంక్స్!' గాయపడందే కళలోని ఆనందం లభించదుకదా మరి?!' కళలో రక్తపురంగు కలిసేంతవరకు అది సజీవంగా వుండదు.' ఎంతో సహజంగా అతను చిరునవ్వుతో అన్నాడు. అతను చిత్రకారునివైపు చూశాడు. చిత్రకారుని ముఖంలోని కఠినమైన రేఖల్లో సహజత్వం వుంది.

'గుడ్, నీలో కళల పట్ల అవగాహన వుంది మిష్టర్!'

'థ్యాంక్స్! నేనొక సామాన్యమైన కళా సమీక్షకున్ని. రచయితని. నిజమైన కళా నిపుణులు, అమరసాధకులు మీరు. మీరు కళా జగత్తుకు ఎన్నో గొప్ప కళాఖండాలనందించారు. మీవద్ద అమూల్యమైన చిత్రకళా భాండాగారముంది. మీరు...'

'నావద్ద ఏమీలేదు- నేను నా భాండాగారాన్ని కాల్చేశాను.' చిత్రకారుడు గంభీర స్వరంతో అన్నాడు. అతను అతీతంలోకి వెళ్ళిపోయాడు.

'కానీ ఎందుకని?' సమీక్షకుడు కేకేసినట్లన్నాడు. అది విని అతను గాయపడ్డాడు.

'మీ శ్రేష్ఠమైన పెయింటింగ్స్‌ని మీ చేతుల్తోనే ఎలా కాల్చేశారు?' అతను వింతగా చిత్రకారుని చూడసాగాడు.

'అవి శ్రేష్ఠమైనవి కావు. కేవలం రంగు గీతల్లోని నిర్జీవమైన కలయికలు. వాటిలో జీవంలేదు.' చిత్రకారుని స్వరంలో బాధ వుంది.

'కానీ మీరు కళకు అన్యాయం చేశారు. కళను నాశనం...'

'లేదు, కళను నేను నాశనం చేయలేదు. కళయే నన్ను, నా ప్రేమను, నా ప్రపంచాన్ని నాశనం చేసింది.'

'కళ నాశనం చేసిందా? కళ సృష్టిస్తుందికానీ...'

'అప్పుడప్పుడూ కళ విసర్జించడమే కాదు. సర్వనాశనం కూడా చేస్తుంది' సమీక్షకుని మాటను మధ్యలోనే తుంచివేస్తూ

హిందీ కథానిక: లక్ష్మీనారాయణ్‌రంగా
తెలుగు అనువాదం: కొమ్మిశెట్టిమోహన్

చిత్రకారుడన్నాడు.

'కానీ ఎలా?' సమీక్షకుని మనసులో సహజమైన ప్రశ్న ఉదయించింది.

'ఎలానా?' 'నమ్మకం కలగడంలేదు కదూ? కానీ జీవితంలో అప్పుడప్పుడూ అలా జరుగుతూ వుంటుంది. అది నమ్మశక్యం కాదు. నా పట్ల కూడా అలాగే జరిగింది. ఎదురుగా వేలాడుతున్న పెయింటింగును చూడు.' చిత్రకారుడు గోడవైపు చూపించాడు.

'ఓహ్! వండర్‌ఫుల్! ఎక్సలెంట్! మాగ్నిఫిసెంట్! అన్‌బిలీవబుల్!' ఆ పెయింటింగ్ కళాత్మకత పట్ల మిక్కిలి ప్రభావితుడై భావావేశంలో చెప్పుకుపోతున్నాడతను. నేనిలాంటి పెయింటింగ్ జీవితంలో చూడలేదు.'

'ఇది పెయింటింగ్ కాదు జీవితం. ఈ పెయింటింగ్ జీవం పోసుకోడానికి నా జీవితాన్ని బలి తీసుకుంది. ఈ పెయింటింగ్ విశ్వవిఖ్యాతి గాంచింది. కానీ విశ్వం ఇందులోనే లుప్తమైపోయింది' చిత్రకారుడు బాధాభరితంగా, దీర్ఘంగా నిట్టూర్చి మౌనం వహించాడు. సమీక్షకుడు కూడా మౌనంగా వుండిపోయాడు.

కొంచెంసేపు ఆవహించిన ఆ మౌనం ఎంతో భారంగా వుంది. తుదకు మౌనాన్ని ఛేదిస్తూ సమీక్షకుడన్నాడు.

'ఇదంతా ఎలా జరిగింది?'

చిత్రకారుడు బాధలోని ముసుగును తొలగిస్తూ అన్నాడు. 'ఈ పెయింటింగ్‌లో మంచుమీద పడుకుని వున్న స్త్రీ- నా ప్రేమ. ఆమె నన్ను, నా కళను విపరీతంగా ప్రేమించేది. ఒక్కోసారి ఆమె ప్రవర్తన చూసి, ఆమె నన్ను ప్రేమిస్తోందా? లేక నా కళను ప్రేమిస్తోందా? నాకు బోధపడేది కాదు. ఎన్నోసార్లు నా కళాకృతి పట్ల నాకే ఈర్ష్య కలిగేది' చిత్రకారుని హృదయంలో ఒక నిట్టూర్పు వెలువడి మాయమయింది.

'ఆమె స్వయంగా భగవంతుని ఉత్కృష్టమైన కృతి. ఆ సౌందర్యంలో నేను భగవంతుని సౌందర్యాన్ని చూసేవాన్ని. ఆమె ఎంత అందంగా వుండేదో, ఆమె మనసు కూడా అంతే నిర్మలమైన మానస సరోవరం. నా కళను తీర్చిదిద్దడంలోనూ, మహోన్నత స్థితికి చేర్చడంలోనూ ఆమె పాత్ర ఎంతో వుంది- బహుశ నాది ఏమీలేదు. ఆమె నా ప్రేయసి కాదు. నా కళ. ఆమె సంపూర్ణ అస్తిత్వం నా కళకోసమే సమర్పితం.' చిత్రకారుని ప్రతి మాటలోను బాధ వ్యక్తమౌతోంది. కొంతసేపు అతను పెయింటింగును చూస్తూ జ్ఞాపకాల్లో జీవించాడు.

మళ్ళీ వర్తమానంలోకి వచ్చి సమీక్షకుని వైపు చూశాడు. ఒక అంతర్జాతీయ చిత్రకళా ఉత్సవానికి పెయింటింగ్ పంపాల్సి వచ్చింది. ఎంత ప్రయత్నించినా మేమిద్దరం అపూర్వమైన చిత్రం తయారుచేయలేకపోయాం. నేను నా స్వంత భావాలతో శ్రేష్టమైన చిత్రం తయారుచేసేవాన్ని. కానీ ఆమె దాన్ని అంతర్జాతీయ స్థాయిలేదని తిరస్కరించేది. నా చిత్రం ఉత్సవంలోనే అత్యుత్తమ చిత్రంగా ప్రకటింపబడాలని ఆమె ఆత్మీయ కోరిక...' అతను ఎదురుగా వేలాడుతున్న పెయింటింగును చూస్తూ తన్ను తాను మరచిపోయాడు. సమీక్షకుడు కూడా మౌనం పాటిస్తూ చిత్రకారుని సంవేదనను పంచుకోసాగాడు.

'తర్వాత ఏమైంది?' సమీక్షకుని ప్రశ్నతో చిత్రకారునికి ధ్యానభంగమైంది.

'అవును... చలికాలం. మంచు కురుస్తోంది. ఆమె బయటి నుంచి తినుబండారాలు తీసుకువచ్చింది.

'ఓహ్! చలి ప్రాణం తీస్తోంది. ఈ చలి..' చెబుతూచెబుతూ ఆమె మౌనంగా వుండిపోయింది. కొంచెంసేపటి తర్వాత నేనడిగాను- 'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అకస్మాత్తుగా ఆమె ఎగిరి గంతేసింది.

'ఎవరూ తాకని ఒక కొత్త విషయం దొరికింది. 'చలిచావు' మంచుమధ్యలో చలికి చావడం ఎంత బాధాకరంగా వుంటుంది?' ఆమె దాన్ని అనుభూతిస్తూ వణికిపోయింది. 'నువ్వు ఈవిషయంపైనే

పెయింటింగ్ వెయ్యి.' ఆమె అంది.

'కానీ నేను అలాంటి అనుభవం ఎప్పుడూ చవిచూడలేదు. అందువల్ల ఆ పెయింటింగ్ సజీవంగా వుండదు' నేను తిరస్కరించాను.

'నేను దాన్ని సజీవం చేస్తాను.' ఆమె భావావేశంలో దృఢసంకల్పముంది.

'ఎలా? ఇది అసంభవం.'

'అంతా సంభవమే- మనలో కోరిక వుండాలి. నేను నీకా అనుభవాన్నిస్తాను.'

'ఎలా...?' నేను అంటూ వుండగానే ఆమె బయటకు వెళ్ళిపోయింది. తిరిగొస్తూ పెద్దపెద్ద మంచుశిలల్ని బండినిండా మోయించుకొచ్చింది. కూలీలు మంచుగడ్డల్ని గదిలో వుంచి వెళ్ళారు. ఆమె అంది- మంచు చలిలో మరణించేవారి శారీరక, మానసిక భావాల్ని, చేష్టల్ని నువ్వు సూక్ష్మంగా పెయింట్ చెయ్యాలి. నీకు కావలసిన రంగుల్తో సిద్ధపడు. నేను మంచు మీద నగ్నంగా పడుకుని ఆ అనుభవాలన్నీ పలికిస్తాను. నీవొక అపూర్వమైన, అద్వితీయమైన పెయింటింగ్ తయారుచెయ్యగలవు.' 'చలిచావు' పెయింటింగ్‌ని వూహించుకుని ఆమె ఎంతో ప్రసన్నంగా వుంది.

దానివల్ల జబ్బుపడే ప్రమాదముందని ఆమెకు నేను నచ్చజెప్పాను. 'నేనెలాంటి పెయింటింగ్ వెయ్యను. ఎప్పటికీ వెయ్యను.'

'కానీ ఆమె వినలేదు. మొండికేసింది. ఒట్టు వేయించుకుంది. తుదకు నన్ను వివశున్ని చేసింది.' చిత్రకారుడు కొంచెంసేపు ఆగాడు. కళాసమీక్షకుడు ఆశ్చర్యంతో, లీనమైన మనోయోగంతో వింటూ వున్నాడు.

'నేను సమ్మతించేటప్పటికి ఆమె ఎంతో ఆనందించింది. ఆమె తన బట్టలు విప్పేసింది. నవ్వుతూ మంచుమీద పడుకుంది. నేనామె మంచుమీద పడుకోవడం చూసి ఎంతో దుఃఖించాను. కానీ ఆమె త్వరగా పెయింటింగ్ గీయమంది. నేను చిత్రం గీయడం ప్రారంభించాను. నేను గీతలు గీచేటప్పటికి ఆమె వణకసాగింది. నేనామె అవస్థ చూడలేకపోయాను. ఆమె తన వణుకును, శబ్దం చేసే దంతాలను నియంత్రిస్తూ నాతో నవ్వుతూ అంది- 'భయపడవద్దు. నేను బాగానే వున్నాను. నువ్వు శ్రేష్ఠమైన పెయింటింగ్ వేయగలిగితే, నేను జబ్బుపడినా అదీ ఒకవరంగానే భావిస్తాను. నువ్వు చిత్రం గీయడంలో లీనంకావాలి.'

'నేను చిత్రానికి రంగులు వేయసాగాను. మంచుమీద నిలిచిన ఆమె శరీర భాగం మెల్లగా నీలంగా మారుతోంది. ఒక కల్పనాతీతమైన చిత్రం తయారవుతోంది. నేనామె వైపు చూసినప్పుడల్లా చిరునవ్వు చిందించేది. నన్ను ఉత్సాహపరిచేది. చిత్రం సంపూర్ణత సంతరించుకునేకొద్దీ నేను కూడా ఆకర్షితుడనయ్యాను. వాస్తవానికి చిత్రం అనుపమానంగా, అద్భుతంగా, ఊహాతీతంగా తయారవుతోంది.'

'ఇక చలికి మరణిస్తున్నట్లు అభినయిస్తాను. మాట్లాడను- కదలను- నువ్వు నిశ్చింతగా చిత్రంగీయి. ఆమె కళ్ళు మూసుకుంది. ఆమె శరీరంలో చాలాభాగం నీలి రంగులోకి మారింది. నేనామెను చూస్తూ వుండిపోయాను- వచ్చే మార్పులను రంగులతో చిత్రించసాగాను. రంగులు దిద్దసాగాను- నేను ఆ అద్భుతమైన చిత్రానికి మైమరచాను. సర్వం మరచిపోయాను. చిత్రానికి రంగులద్దడంలో లీనమయ్యాను. ఆఖరి స్ట్రోక్ తర్వాత నేనామెవైపు చూశాను. ఆమె నిర్వికారంగా నిద్రపోయింది. ఆమె ముఖంలో చిరునవ్వు. ఆమె శరీరం చల్లదనానికి నీలంగా మారిపోయింది. చిత్రానికి, ఆమెకు పూర్తి సామ్యముంది.'

'నేను దూరం నుంచి చిత్రాన్ని చూసి ఆనందంతో నాట్యం చేశాను. 'ఆ పీస్ వండర్‌ఫుల్‌గా వుంది.' నేను కేకేశాను.

'కంగ్రాచ్యులేషన్స్!' మనం కళాజగత్తుకు ఒక అపూర్వమైన చిత్రాన్ని సమర్పించాం. అభినందనలు. ఇకలేచి, నీ అపూర్వమైన చిత్రం చూడు.' ఆమె కదల్లేదు. నేనామెను లేపాను. కానీ...'

చిత్రకారుడు... అతని గొంతు అసహనీయమైన వేదనతో అవరుద్ధమైంది. అతని కళ్ళలో నిరంతరంగా ఆవేదన ప్రవహిస్తోంది. అతను వెక్కివెక్కి పోతూ అన్నాడు-

'ఆమె నన్ను అపూర్వమైన చిత్రకారుని చేయగలిగింది- కానీ..., ఆమె... చలిచావు... చచ్చింది...' అతను వెక్కివెక్కి ఏడ్వసాగాడు. పెయింటింగ్‌లో మంచు చుక్కలుచుక్కలుగా కరగుతోంది. ●



సల్మాన్‌తో రాణీముఖర్జీ పాట్లు ...?

ఇండస్ట్రీలో సాధారణంగా హీరోలకు బాగా పలుకుబడి ఉంటుంది. హీరోయిన్లతో పోల్చుకుంటే హీరోలకే కాస్తంత పలుకుబడి ఎక్కువనే చెప్పొచ్చు. సెట్ మీద ఉన్నవాళ్ళందరు కూడా హీరో ఎలా చెప్తే అలా నడుచుకుంటారు. అందుకని తనలో ఉన్న చెడు ఆలోచనలు అందరిమీద రుద్దాలని చూడకూడదు కదా! ఏంటి హీరోల మీద విజృంభించామని అనుకుంటున్నారా. లేదండి ఇదంతా రాణీముఖర్జీ గోడు.

ఒకసారి కోలా కంపెనీ వారు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీకి రాణిముఖర్జీ ప్రోగ్రామ్ ఇవ్వాల్సి వచ్చింది. అదికూడా పేరొందిన హీరోతో. ఈమెతో కలిపి స్టేజిపై డ్యాన్స్ చేస్తున్న హీరోగారికి చొక్కా లేదు. పెద్ద బూట్లు వేసుకొని డ్యాన్స్ చేస్తున్నారు, అదేనండి ఈ ఫోజులో ఇంకెవరు కనపడతారు, మన డాషింగ్ డేరింగ్ హీరో సల్మాన్‌ఖాన్. అయితే సల్మాన్ డ్యాన్స్ చేస్తున్న మైకంలో పక్కనే ఉన్న రాణి కాలు తొక్కుతున్నది పట్టించుకోలేదు. అయితే ఈ విషయాన్ని చెప్తున్నా పట్టించుకోలేదు(పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ ఉండటం వల్ల కాదు.) కావాలనే. దాంతో రాణి అక్కడినుంచి తనకు కేటాయించిన గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె గదినుంచి తిరిగి డాన్స్ వేయడానికి స్టేజి మీదకు వచ్చేటపుడు పెద్ద హీల్‌తో బరువైన బూట్లు వేసుకుని వచ్చింది. ఈ ప్రోగ్రామ్‌కి బ్యాక్‌గ్రౌండ్‌లో వస్తున్న పాట "హిట్ మి హార్డర్". ఎంత పాటకు అను గుణంగా నృత్యంచేయాల్సి వస్తే మాత్రం మరీ ఇంత ఇదిగా చెప్తున్నా వినిపించుకోకుండా కాలు తొక్కాలా, ఇది ఏదో పొరపాటున జరిగిన విషయం కాదు కావాలనే సల్మాన్ అలాచేశాడని వాపోతుంది రాణీముఖర్జీ. పాపం రాణి.

'ఎయిటీన్ టిల్ డై'

ఒక హీరోయిన్ ఎవరని అడక్కండి. ఈ మధ్యనే 18 సంవత్సరాలు వచ్చాయి. ఎన్ని సంవత్సరాలని కూడా అడక్కండి. ఇవన్నీ ఏవిధంగా కూడా సంబంధంలేని ప్రశ్నలు. నందితా దాస్ తన వయసు చెప్పటానికి ఏ మాత్రం సిగ్గుపడదు. ఏంటి చెప్పింది నమ్మబుద్ధికావట్లేదు అంటున్నారా. మీకు ఇక్కడ ఆధారాన్ని కూడా ఇస్తున్నాం. ఈ మధ్యనే మహేష్‌మంజ్రేకర్ షూటింగ్ 'పితా'లో షూటింగ్‌లో నందితా తన జ్యూవలరీ బ్యాగ్‌ను పోగొట్టుకుంది. ఆమె. అనుచరులు చాలా డెస్పరేట్‌గా దానిగురించి వెతికారు. అయితే నందితకు వెంటనే ఒక విషయం గుర్తొచ్చింది తను ఉన్న హోటల్‌లో ఉన్న స్నేహితురాలి గదిలో మరచిపోయానేమోనన్న విషయం గుర్తువచ్చింది. వెంటనే ఆ గదికి వెళ్ళి తలుపుకొట్టింది. అయితే జరిగిన ఘోరం ఏమిటంటే తన స్నేహితురాలి గది అనుకొని వేరే గదికెళ్ళి తలుపు కొట్టింది. ఆ గదిలో ఉంటున్న ఆవిడ నందితకు మంచి ఫ్యానట (ఏంటి సీలింగ్ వంక చూస్తున్నారు. సీలింగ్ ఫ్యాన్ కాదు). సారీలు గట్రా అయిన తరువాత, ఆ గదిలో ఉన్నావిడ నందితను "నీకు ఎన్ని సంవత్సరాలు అని అడిగింది?", అప్పుడు ఆమె ఒక చిరునవ్వు నవ్వి కళ్ళల్లో మెరుపుతో చిన్నదాన్నేనని చెప్పిందట. ఇలాంటి ఇబ్బందులనుండి బయట పడటానికి నందితాదాస్ సినీస్నేహితురాలు ఒక మహత్తర మార్గం చెప్పిందట "బ్రయాన్ ఆడమ్స్" సిద్ధాంతాన్ని ఫాలోకమ్మని. ఆ మంత్రం "ఎయిటీన్ టిల్ డై". ఇంకా ఏంటీ చూస్తున్నారు. మరణించేవరకు పద్దెనిమిది సంవత్సరాలేనని చెప్పుమని అర్థం. మీరు ఇప్పటినుండి ఆ దేపద్ధతిపాటిద్దామనుకుంటున్నారా అదేం కుదరదు ఇది కేవలం సినిమా వాళ్ళకి మాత్రమే.



- వి.కె